జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
10 గురువారం, సెప్టెంబర్ 2026 పేజీలు:13




02లో

## దొడ్డు బియ్యం వేలం సక్రమంగా నిర్వహించాలి

- ధాన్యం రవాణాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

# పెద్ద చింతరేవులలో వైభవంగా వరుణ యాగం



గద్వాల సెప్టెంబర్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం దేవాదాయ,ధర్మాదాయ శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు వరుణ యాగాన్ని వైభవంగా నిర్వహించారు.ఆలయ కార్యనిర్వహణ అధికారి రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆద్య మద్వాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య వామనాచారిలచే స్వామివారి సన్నిధిలో వరుణ యాగం నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపక వంశీయులు గిరిరావు దంపతులు యాగ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులతో పాటు ఆలయ కార్యనిర్వహణ అధికారి రాజేశ్వర శర్మ,తెలంగాణ రాష్ట్ర గొర్రెల,మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గద్వాల సరిత తిరుపతయ్య,భీంపురం,పెద్ద చింతరేవుల గ్రామ సర్పంచ్ గాల్ల రఘు,గ్రామ యువత పాల్గొన్నారు.వరుణ యాగంలో ఉడిపి పాలిమారు పీఠాధిపతి శ్రీ 1008 విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు పాల్గొని పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు,పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాగాన్ని నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# దొడ్డు బియ్యం వేలం సక్రమంగా నిర్వహించాలి

## ;ధాన్యం రవాణాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

చౌక ధరల దుకాణాల్లో (ఫెయిర్ ప్రైస్ షాపులు) అందుబాటులో ఉన్న దొడ్డు బియ్యం వేలం ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ రేషన్ షాప్ డీలర్లకు సూచించారు. బుధవారం దొడ్డు బియ్యం వేలం నిర్వహణకు సంబంధించి రేషన్ షాప్ డీలర్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించి, వేలం ప్రక్రియపై పలు సూచనలు చేశారు. నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ వేలం ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. అనంతరం రాబోయే వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి లారీ యజమానులతో అదనపు కలెక్టర్ సమావేశమై రవాణా ఏర్పాట్లను సమీక్షించారు. ధాన్యం రవాణాకు గుర్తించిన అన్ని లారీలకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం సక్రమంగా పనిచేసేలా చూడాలని లారీ యజమానులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆమె ఆదేశించారు. సంబంధిత అధికారులు, లారీ యజమానులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం రవాణా ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ హరిప్రియ సూచించారు.

# గణేష్ మండపాల వివరాలు నమోదు చేయాలి

## మాగనూరు ఎస్ఐ అశోక్ బాబు




**మాగనూరు, సెప్టెంబర్ 09(ప్రజా జ్యోతి)**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయనున్న నిర్వాహకులు తమ మండపాల పూర్తి వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మాగనూరు ఎస్ఐ అశోక్ బాబు కోరారు.నమోదు చేసిన వివరాల కాపీని మాగనూరు పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. ముందస్తుగా మండపాల వివరాలు పోలీసులకు అందించడం ద్వారా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా చర్యలు, నిమజ్జనం, ట్రాఫిక్ నియంత్రణపై నిర్వాహకులకు సకాలంలో సమాచారం అందించేందుకు వీలుంటుందని తెలిపారు.ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్ఐ అశోక్ బాబు విజ్ఞప్తి చేశారు.

# అవగాహనతో అప్రమత్తతే నేరాల నివారణకు తొలి అడుగు

## - రోడ్డు భద్రత,సైబర్ నేరాలు,డ్రగ్స్,పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన

**గద్వాల సెప్టెంబర్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి)**

:జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం గద్వాల మండలం జమ్మిచెడు గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది.రోడ్డు భద్రత,సైబర్ నేరాలు,డ్రగ్స్ దుష్ప్రభావాలు,పోక్సో చట్టం,సీసీ కెమెరాల ప్రాధాన్యత తదితర అంశాలపై కళాబృందం సభ్యులు పాటలు,ప్రదర్శనల ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.హెల్మెట్ ధరించడం చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే కీలక భద్రతా చర్య అని వివరించారు.హెల్మెట్‌ను సక్రమంగా ధరించి స్ట్రాప్ బిగించుకోవాలని,వేగాన్ని నియంత్రించుకోవాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.మైనర్లు వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్112కు సమాచారం అందించాలని, సమాచారం అందిన వెంటనే సమీపంలోని బ్లూ కోల్ట్స్ సిబ్బంది స్పందిస్తారని తెలిపారు. పోక్సో





చట్టం ప్రకారం బాలలు,బాలికలపై జరిగే లైంగిక నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు.మహిళలు,బాలికలను ఎవరైనా వేధించినా,ఇబ్బందులకు గురిచేసినా షీ టీమ్ నంబర్ 8712670312కు సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.బ్యాంకు ఖాతా వివరాలు,ఓటీపీ,పాస్‌వర్డ్‌లు,ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు.డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు తమ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాధమ్మ,రామాంజనేయులు,షీ టీమ్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ శేషన్న,ఏహెచ్‌టీయూ సిబ్బంది నరేష్,పోలీస్‌స్టేషన్ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డెక్కన్ గాంధీ పాల్లెర హనుమంతరావుకు ఘన నివాళి

## - 47వ వర్ధంతి సందర్భంగా స్మరించుకున్న కాంగ్రెస్ నేతలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజల హృదయాల్లో 'డెక్కన్ గాంధీ'గా చిరస్థాయిగా నిలిచిన పాల్లెర హనుమంతరావు 47వ వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన సేవలను స్మరించుకున్నారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్, తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ తదితరులు పాల్లెర హనుమంతరావు సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రజాసేవనే పరమావధిగా భావించి పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన పాల్లెర హనుమంతరావు సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాటాలను ఎప్పటికీ మరువలేమన్నారు. పాల్లెర హనుమంతరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రజాసేవ కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు బెక్కరి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రాములు యాదవ్, ఎం.ఏ. కలీమ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్ అలీ, మీడియా విభాగం సీజే బెనహర్, కార్పొరేటర్ తాహెర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు బసీద్, అక్బర్, టి.సి. శ్రీనివాస్, అబ్రార్ ఉసేన్, మొయిజ్, హరినాథ్, పీర్ మొహమ్మద్, సాదిక్, సేవాదళ్ వెంకట్ లక్ష్మి, అలీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.



# కాళోజి జయంతి ఘనంగా

**అలంపూర్ డివిజన్ ప్రజా జ్యోతి సెప్టెంబర్ 09:**

10వ బెటాలియన్ లో బుధవారం ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమాండెంట్ బి.ఆదినారాయణ కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యలను తన కలంతో ప్రశ్నించిన కాళోజి ఆశయాలు నేటి తరానికిస్ఫూర్తిదాయకమన్నారు.సిబ్బంది విధులను అంకితభావం క్రమశిక్షణతో నిర్వర్తించి ప్రజల భద్రతకు సేవలందించాలని సూచించారు.యువత ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పార్థసారథి రెడ్డి,వెంకటరమణ, ఎస్ఐలు నిరంజన్ రెడ్డి, భార్గవ రెడ్డి,ప్రసన్న, తిరుపతి,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు కేజీబీవీ పీఈటీ జి. త్రివేణి ఎంపిక: నర్వలో ఘన సన్మానం

**నర్వ సెప్టెంబర్ 9 ప్రజా జ్యోతి**

రాష్ట్రస్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి, కాంస్య పతకం సాధించిన లిస్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పీఈటీ జి. త్రివేణి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాయికోడ్ గ్రామానికి చెందిన జి. త్రివేణి, తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీలలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట అటవీ ప్రాంతంలోని వెదురు వనంలో నిర్వహించిన 'ఎలైట్ మహిళా సీనియర్ రాష్ట్రస్థాయి 5 కి.మీ మౌంటెన్ సైక్లింగ్' పోటీలలో పాల్గొన్నారు. కఠినమైన ట్రాక్‌పై అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు ఈ ప్రదర్శనతో ఆమె జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. అక్టోబర్ 1 నుండి 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని మహేంద్రగిరిలో జరగనున్న జాతీయ స్థాయి సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున త్రివేణి ప్రాతినిధ్యం వహించనున్నారు.మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో ఘన సన్మానం ఈ నెల 9న బుధవారం నర్వ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పీఈటీ జి. త్రివేణితో పాటు కోచ్ బి. గోపాలంను ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించి





అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి. శ్రీనివాసులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని, త్రివేణి సాధించిన విజయం నర్వ మండలానికి గొప్ప కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టిందని కొనియాడారు. జాతీయ స్థాయిలోనూ రాణించి స్వర్ణ పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల ప్రత్యేక అధికారి గోపాలచారి, ఎంపీవో రాఘవేందర్, ఎంఈవో రామ్‌రెడ్డి, నర్వ సర్పంచ్ హనుమంతు రెడ్డి, ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు మల్లేష్, మధుబాబు మరియు వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు బాధ్యతతో శాంతి భద్రతలు సీఐ ప్రదీప్

- కొండందాపూర్‌లో అలంపూర్ సర్కిల్ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం
- ప్రజల భద్రతే పోలీస్ శాఖ ధ్యేయం
- ఆన్‌లైన్ పోర్టల్‌లో గణేష్ మండపల వివరాల నమోదు తప్పనిసరి

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి )సెప్టెంబర్ 09:**

కొండందాపూర్ రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా,సోదరభావంతో మరియు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు కొండందాపూర్ ఎస్.ఐ. తరుణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సర్కిల్ స్థాయి గణేష్ ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఇట్టి సమావేశంకు అలంపూర్ సీఐ వి. ప్రదీప్ కొండందాపూర్, ఇటిక్యాల,ఉండవెల్లి, అలంపూర్ నాలుగు పిఎస్ లకు చెందిన ఎస్ఐలు తరుణ్ కుమార్,రవి రథోడ్, సురేశ్,రామకృష్ణ లు గణేష్ ఉత్సవ నిర్వాహకులు,సమన్వయ కమిటీ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు.సమావేశానికి సుమారు 100 మంది హాజరై గణేష్ ఉత్సవాల నిర్వహణ,భద్రతా చర్యలు,ఊరేగింపులు, నిమజ్జనం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐ ప్రదీప్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాలతో నిర్వహించడంతో పాటు ప్రజలందరి సహకారంతో శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు.గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని,ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే ప్రతి నిర్వాహకుడు తమ మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ పోలీస్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అలంపూర్ సీఐ సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు,విగ్రహ వివరాలు,ఉత్సవ తేదీలు,నిమజ్జనం మరియు ఊరేగింపు తదితర వివరాలను పోలీస్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు.మండపాల వివరాలను ముందుగానే ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా పోలీస్




శాఖ భద్రతా చర్యలు,బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు.ప్రతి గణేష్ మండప నిర్వాహకుడు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.గణేష్ ఊరేగింపుల సమయంలో అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.ఇతరులకు ఇబ్బంది కలగకుండా,ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. గణేష్ నిమజ్జన ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.పోలీసుల సూచనల మేరకు నిర్ణీత మార్గాలు,సమయాలను పాటిస్తూ ఊరేగింపులు నిర్వహించాలని తెలిపారు.గణేష్ ఉత్సవాలు అన్ని వర్గాల ప్రజలు కలిసి ఆనందంగా జరుపుకునేలా మత సామరస్యం,సోదరభావం,పరస్పర గౌరవాన్ని కాపాడాలని పోలీసులు కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని,అనుమానాస్పద సమాచారం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు,ఉత్సవ నిర్వాహకులు మరియు పోలీసుల సమన్వయంతో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహిద్దామని ఆలంపూర్ సర్కిల్ పోలీసులు తెలిపారు.

# గూడెం గ్రామంలో షార్ట్ సర్క్యూట్తో ఇల్లు దగ్ధం కాలి బూడిదైన వస్తువులు

- కట్టుబట్టలతో మిగిలిన కుటుంబం
- రూ.50 వేల నగదు.. రెండు తులాల బంగారం బూడిద
- పొగతో బిచ్చన్నకు శరీరం తీవ్ర గాయాలు.. రూ.10 లక్షల ఆస్తినష్టం
- సిలిండర్ పేలకపోవడంతో తప్పిన పెను ముప్పు

**చిన్నంబావి,సెప్టెంబరు 9 (ప్రజాజ్యోతి)**

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఓ కుటుంబాన్ని కట్టుబట్టలతో మిగిల్చింది. తెల్లవారుజామున నిద్రమత్తులో ఉన్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇల్లు కళ్లముందే అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన చిన్నంబావి మండలం గూడెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రొడ్డ బిచ్చన్న ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో ఇల్లంతా దట్టమైన పొగ కమ్ముకుంది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఇంట్లోని విలువైన వస్తువులు, గృహోపకరణాలు, దుస్తులు, బియ్యం, తినుబండారాలు, పుస్తకాలు, ధ్రువపత్రాలు అన్నీ మంటల్లో బూడిదయ్యాయి.పొగతో బిచ్చన్నకు తీవ్ర గాయాలు మంటలు చెలరేగిన సమయంలో ఇంట్లో ఉన్న రొడ్డ బిచ్చన్న పొగతో అస్వస్థతకు గురై తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 అంబులెన్స్‌లో వీపనగండ్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అగ్నిప్రమాదంలో ఇంట్లోని ఫ్రిజ్, కూలర్, టీవీ, వాషింగ్ మిషన్, డ్రెస్సింగ్ టేబుల్, బీరువా తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. బీరువాలోని సామగ్రి, దుస్తులు, తినుబండారాలు సైతం మంటలకు ఆహుతయ్యాయి. ఇంట్లో భద్రపరిచిన రూ.50 వేల నగదు, 2 తులాల బంగారం కూడా కాలిపోయినట్లు బాధిత కుటుంబం తెలిపింది. విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, సర్టిఫికెట్లు, ఇతర ముఖ్యమైన ధ్రువపత్రాలు బూడిదయ్యాయి.ఇల్లు, ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. కళ్లముందే సర్వస్వం కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో మంటలు చెలరేగిన సమయంలో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సిలిండర్ పేలి ఉంటే పరిస్థితి మరింత విషమించి భారీ ప్రాణనష్టం సంభవించి ఉండేదని గ్రామస్థులు తెలిపారు. అదృష్టవశాత్తు సిలిండర్ పేలకపోవడంతో పెను ముప్పు తప్పింది.మంటలను అదుపు చేసిన గ్రామస్థులు మంటలు కనిపించగానే గ్రామస్థులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నీటితో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అనంతరం కొల్లాపూర్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్సై సమాచారం అందుకున్న చిన్నంబావి ఎస్సై రామన్‌గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తినష్టంపై బాధిత కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.బాధిత కుటుంబానికి సర్పంచ్ పరామర్శ ప్రమాద విషయం తెలుసుకున్న గూడెం గ్రామ సర్పంచ్ కొత్త వెంకటరెడ్డి వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బిచ్చన్నను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి తక్షణమే ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శోభ, గ్రామస్తులు రాఘవేంద్రశెట్టి, మాధురి, చిన్న కురుమయ్య, రొడ్డ వెంకటస్వామి, రంగన్న, పెద్ద కురుమయ్య, పెద్ద నాగశేషు, ఏడో వార్డు సభ్యురాలు మేకల ఈశ్వరమ్మ, శేర్‌పల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.





# వేములలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు.. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు!

## - పాఠశాల, పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన.. పదో తరగతి విద్యార్థులకు గణితంపై పట్టు సాధించాలని సూచన

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మూసాపేట మండలం వేముల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ సేవల అమలు తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేముల జడ్.పి.హెచ్.ఎస్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యాబోధన, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల వసతులు, నిర్మాణ పనులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. స్టాఫ్ రిజిస్టర్‌తో పాటు విద్యార్థుల హాజరు, మార్కుల నమోదును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న అక్షయపాత్ర భోజనాన్ని కూడా తనిఖీ చేశారు.

### గణితంపై పట్టు సాధించాలి:

పదో తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. సిలబస్ ఎంతవరకు పూర్తయింది, పాఠ్యాంశాల పురోగతి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. గణితంలోని సూత్రాలు, సమస్యల పరిష్కారంపై ప్రశ్నలు వేసి విద్యార్థుల అవగాహనను పరిశీలించారు. గణితంలో మంచి మార్కులు సాధించాలంటే కేవలం సూత్రాలను గుర్తుపెట్టుకోవడం కాకుండా వాటిని నిరంతరం సాధన చేయాలని సూచించారు. సమస్యలను స్వయంగా పరిష్కరిస్తూ గణితంపై పూర్తి పట్టు సాధిస్తే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

### 'శతక మధురిమ'పై కలెక్టర్ ప్రశంసలు:

పాఠశాల విద్యార్థిని కుమారి మాధురి రచించిన 'శతక మధురిమ' పుస్తకాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పనితీరును కూడా ప్రశంసించారు. పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైన నేపథ్యంలో కేటాయించిన నిధులు, వాటి వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని పరిశ్రమల యాజమాన్యాల సహకారంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### పల్లె దవాఖానలో వైద్య సేవలపై ఆరా.!

అనంతరం పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్ రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య, సాధారణంగా నమోదవుతున్న అనారోగ్య సమస్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అందిస్తున్న కాల్షియం మాత్రలు, ఇతర మందుల నిల్వలను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడిన కలెక్టర్ ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయి, గ్రామంలోని పరిస్థితులు, పాఠశాల పనితీరు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమర్థవంతంగా పనిచేస్తున్నారని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు.

### మధ్యాహ్న భోజన నాణ్యతపై పరిశీలన:

వేముల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు, భోజనం నాణ్యతపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### అంగన్‌వాడీలో మెనూ ఉల్లంఘనపై ఆగ్రహం:

వేముల అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని





పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూలో ఆ రోజు 'ఎగ్ బిర్యానీ' ఉన్నప్పటికీ, బియ్యం వండి దానిపై గుడ్డు వేసి అందిస్తున్నట్లు గుర్తించారు. నిర్దేశిత మెనూ ప్రకారం ఆహారం సిద్ధం చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ పర్యటనలో మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## - ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో చైతన్యం, స్ఫూర్తిని నింపడంలో కాళోజీ నారాయణరావు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడంతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారని గుర్తుచేశారు. సమాజంలోని అన్యాయాలు, అసమానతలపై తన రచనల ద్వారా ప్రశ్నించిన కాళోజీ ఆలోచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవ, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, ఏ.ఓ. సువర్ణ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీలతో ఈఆర్ఓ సమావేశం

## - అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు అవకాశం.. నవంబర్ 9న తుది ఓటరు జాబితా



**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం సమావేశం నిర్వహించారు. జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌తో పాటు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలంగాణ జారీ చేసిన సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈఆర్ఓ వివరించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్ 7, 2026 వరకు అవకాశం ఉండగా.. నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు కొనసాగనుంది. తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు.

### ఎంపీడీఓలకు అదనపు బాధ్యతలు:

ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు హరిప్రియ తెలిపారు.

### పెండింగ్ నోటీసులపై ప్రత్యేక దృష్టి:

ఎస్ఐఆర్‌లో భాగంగా ఇప్పటికే జారీ చేసిన నోటీసుల్లో ఎన్ని సర్వ్ అయ్యాయి, ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలపై ఈఆర్ఓ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులను నిర్ణీత గడువులోగా సర్వ్ చేయడంతో పాటు, సంబంధిత కేసులను నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

### 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు:

ఎస్ఐఆర్‌లో భాగంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండో విడత ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం6, ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం7, పేరు, చిరునామా తదితర వివరాల సవరణ కోసం ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో తన వివరాలను పరిశీలించుకునేలా రాజకీయ పార్టీలు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఈఆర్ఓ హరిప్రియ కోరారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్/ఏఈఆర్ఓ, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, 75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల డీటీ తదితరులు పాల్గొన్నారు.

# అలింకో అసెస్‌మెంట్ క్యాంప్ మూడవ రోజు విజయవంతం



**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన సహాయక పరికరాలను గుర్తించి అందించేందుకు మహబూబ్‌నగర్ అర్బన్ భవిత సెంటర్‌లో నిర్వహిస్తున్న అలీమ్‌కో అసెస్‌మెంట్ క్యాంప్ మూడవ రోజు విజయవంతంగా ముగిసింది. మూడవ రోజు క్యాంప్‌లో మొత్తం 101 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 88 మంది విద్యార్థులకు వ్యక్తిగత అవసరాల ఆధారంగా అసెస్‌మెంట్ నిర్వహించారు. విద్యార్థుల చలనశీలత, సంభాషణ, విద్యాభ్యాసం తదితర అవసరాలను పరిశీలించి, వారికి అనువైన సహాయక పరికరాలు, ఉపకరణాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. క్యాంప్ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను మహబూబ్‌నగర్ సీఎంఓ సుధాకర్ రెడ్డి సమన్వయపరిచి, కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు అవసరమైన మార్గదర్శకత్వం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అలింకో అసెస్‌మెంట్ బృందంతో పాటు ఐఈఆర్‌పీలు క్యాంప్‌లో చురుకుగా పాల్గొని, విద్యార్థుల అసెస్‌మెంట్ ప్రక్రియలో సహకరించారు. తల్లిదండ్రులకు కూడా అవసరమైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. అర్హులైన ప్రత్యేక అవసరాల పిల్లలకు వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా సహాయక పరికరాలు, ఉపకరణాలు అందించడం ద్వారా వారి చలనశీలత, సంభాషణ, విద్యాభ్యాసం, స్వావలంబనతో పాటు జీవన నాణ్యతను మెరుగుపరచడం ఈ అసెస్‌మెంట్ క్యాంప్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# మద్యం డిపోలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## - సరఫరా, నిల్వలు.. నకిలీ మద్యం నియంత్రణపై ఆరా తీసిన

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 9( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల పరిధిలోని తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ( టీఎస్ బీసీఎల్ ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధికారిక ఇండియన్ మేడ్ లిక్కర్ ( ఐ ఎం ఎల్) డిపోను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ బుధవారం సాయంత్రం  ఐ ఎం ఎల్సందర్శించి నిలువలను పరిశీలించారు. డిపోలో మద్యం నిల్వలు, సరఫరా విధానం, భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.డిపోకు వివిధ ప్రాంతాల నుంచి మద్యం ఏ విధంగా సరఫరా అవుతోంది, ఇక్కడి నుంచి ఏయే జిల్లాలు, ప్రాంతాలకు మద్యం సరఫరా జరుగుతోంది అనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మద్యం సరఫరా వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు.అలాగే నకిలీ మద్యం సరఫరాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున, అక్రమ మద్యం తయారీ, రవాణా, సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అనుమానాస్పద కదలికలు, అక్రమ సరఫరా గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.డిపోలోని ప్రస్తుతం ఉన్న మద్యం స్టాక్ పాయింట్, నిల్వల పరిమాణం, వివిధ రకాల మద్యం నిల్వలు, రోజువారీ సరఫరా వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లు, సరఫరా రికార్డులు తదితరాలను సక్రమంగా నిర్వహించాలని, నిల్వలుసరఫరా వివరాల్లో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు.డిపోలో మద్యం నిల్వలు భద్రంగా ఉండేలా అవసరమైన భద్రతా ప్రమాణాలను పాటించాలని, అగ్నిప్రమాదాలు తదితర ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.డిపోలో 75 వేల బీర్ కాటన్లు, సుమారు 62 వేల లిక్కర్ కాటన్ల మద్యం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, మహబూబ్ నగర్ షాద్ నగర్ కోస్గి కొడంగల్ ప్రాంతాల మద్యం దుకాణాలకు సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్కు అధికారులు వివరించారు.జిల్లా కలెక్టర్ వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, డిపో మేనేజర్ మల్లికార్జున్, స్టోర్ ఆఫీసర్ మధు, తహసీల్దార్ జయంతి, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



# విద్యా అభివృద్ధిపై అధికారులు శ్రద్ధ వహించాలి

## సర్వసభ్య సమావేశములో మండల విద్యా శాఖ అధికారిపై సర్పంచుల సంతృప్తి వ్యక్తం చేస్తూ

**నర్వ సెప్టెంబరు 9 ప్రజా జ్యోతి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభివృద్ధి పై అధికారులు శ్రద్ధ వహించాలని కోరుతూ సంబంధిత శాఖ మండల అధికారిపై సర్వసభ సమావేశంలో సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు, బుధవారం నర్వ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షులతో సర్వసభ్య సమావేశం జరిగింది, ఈ సమావేశానికి మండలంలోని  అన్ని గ్రామాల సర్పంచులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా సమావేశంలో ఆయా శాఖల అధికారులు, తమ నివేదికలను వివరిస్తుండగా విద్యా వైద్యం తదితరా శాకలాపరమైన అధికారులు తమ అంశాలను వెల్లడిస్తుండగా విద్యాశాఖ అధికారి  మాట్లాడుతూ మండల గ్రామాల్లో పాఠశాలలోని మౌలిక వసతులు బాగున్నాయని తెలుపుతుండగా, విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దుస్తుల పంపిణీ తదితర అంశాలను వివరిస్తుండగా, రాంపూర్ గ్రామ సర్పంచ్ నాగరాజు, ఉండే కోడ్ గ్రామ సర్పంచ్ జగన్నాథములు, ఒకసారి గా మండల విద్యాశాఖ అధికారికి అడ్డు తగులుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సౌకర్యాలను పక్కన పెట్టండి అవి ఎలాగూ జరుగుతాయి, కానీ ఆ గ్రామాలలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యా వాలంటీర్ లను తక్షణమే నియమింపజేయాలని జిల్లా కలెక్టర్కు విన్నవించాలని కోరారు  విద్యాభివృద్ధిపై సంబంధిత ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి పాఠాలు బోధించాలని సూచించారు, సకాలంలో  పాఠశాలలకు రాకపోవడంతో విద్యార్థులు సిలబస్సులు వెనకబడి పోతున్నాయని సంబంధిత అధికారులు పర్యవేక్షణ జరపాలని తెలిపారు, చేతేస్తా ఈ సమస్యలను ఎంఈఓ గారు తక్షణమే జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయాలని తెలిపారు, అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతమే మ్యారేజ్ పనులలో ఇంతవరకు 100 రోజుల పనులకు గాని ఇప్పుడు 120 రోజుల పనులు చేసుకొనుటకు కూలీలకు ప్రభుత్వాలు వెసులుబాటు కల్పించాయన్నారు, ఇదేవిధంగా 418 పనుల గాను జల శ్రీ వ్యవసాయ పనులలో మెటీరియల్ పనులకు అనుమతులు వచ్చాయని రైతులు అవసరమైన పొలాల్లో విపత్తు వలన వరదలు వంపులు పోకుండా నీటి మళ్లింపు కాలువలు కుంటలతో పనులను ఎన్ ఆర్ ఏజ్ ద్వారా చేసుకోవచ్చని తెలిపారు, అవసరమైన రైతులు ఆ గ్రామాలలోని సంబంధిత ఎన్ఆర్ఐజేస్ సిబ్బందికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు, అంతకంటే ముందు విద్యుత్తు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు , తమ తమ నివేదికలను సభలో చదివి వినిపించారు, ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తాసిల్దార్ మల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



# గురుకుల బాలికలకు కంటి అద్దాలు పంపిణీ

## - ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు టెక్నాలజీని విద్యాభివృద్ధికి వినియోగించుకోవాలి : డీఎంహెచ్ఓ డా. ఏ. శ్రీనివాసులు



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాల, రాంరెడ్డిగూడెంలో బాలికలకు కంటి అద్దాలను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు బుధవారం పంపిణీ చేశారు. ఇంతకుముందు పాఠశాల/కళాశాలలో మొత్తం 91 మంది బాలికలకు కంటి చూపు పరీక్షలు నిర్వహించగా, వారిలో చూపు లోపాలు ఉన్నవారిని గుర్తించి కంటి అద్దాల కోసం ఇండెంట్ పంపించారు. వైద్యారోగ్య శాఖకు అద్దాలు అందడంతో అర్హులైన బాలికలకు వాటిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీని కేవలం వినోదం కోసం కాకుండా విద్యాభివృద్ధికి ఉపయోగించుకోవాలని అన్నారు.హాస్టల్‌లో ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బాలికలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డా. శంకర్ , డా. శైలజ, ప్రిన్సిపాల్ శ్రీమతి వాణిశ్రీ, డా. పులి విద్య, హన్మంతు, సుభాష్ చంద్ర, సీతారామ్ గౌడ్, ఆర్ బి ఎస్ కే సిబ్బంది, రమేష్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## - స్పాట్ అసెస్‌మెంట్‌తో అభ్యసనా సామర్థ్యాల పై పరిశీలించిన - డి ఈ ఓ రమేష్ కుమార్





**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 9( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్, ఉయ్యాలవాడ ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను స్వయంగా పరీక్షించారు. విద్యార్థులతో మమేకమై గణితం, ఇతర సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. స్పాట్ అసెస్‌మెంట్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి, సంబంధిత వివరాలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ. ప్రతి విద్యార్థి తరగతికి అనుగుణంగా నిర్దేశించిన విద్యా సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆయన ఆదేశించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం కంఠస్థం చేయకుండా, వాటిని అర్థం చేసుకుని ఆచరణలో పెట్టే విధంగా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు . గణితంలో ప్రాథమిక అంశాలపై విద్యార్థులకు పట్టు కల్పించాలని, సమస్యలను స్వయంగా పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించాలని డీఈవో పేర్కొన్నారు. అదేవిధంగా చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, విషయాన్ని సొంత మాటల్లో వివరించడం వంటి ప్రాథమిక సామర్థ్యాలపై కూడా ఉపాధ్యాయులు నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. ఎవరైనా విద్యార్థి ఏదైనా అంశంలో వెనుకబడినట్లు గుర్తిస్తే, విద్యార్థి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక బోధన అందించాలని తెలిపారు. ఒకసారి పరీక్షించి వదిలేయకుండా, తిరిగి అంచనా వేసి విద్యార్థుల్లో వచ్చిన పురోగతిని గుర్తించాలని సూచించారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో విద్యార్థుల సామర్థ్యాలు, పాఠశాల సందర్శన తదితర వివరాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నమోదు చేయాలని డీఈఓ సూచించారు. స్పాట్ అసెస్‌మెంట్ ద్వారా విద్యార్థుల వాస్తవ అభ్యసనా స్థాయిని తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని డీఈఓ రమేష్‌కుమార్ సూచించారు. డీఈఓ వెంట ఇన్చార్జి జి సి డి ఓ నిర్మల, ఇంచార్జీ డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ డిఎస్ఓ శైలజ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# థలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం

## - ముందస్తు స్క్రీనింగ్‌తో వ్యాధులను గుర్తించాలి..

## ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**




వంశపారంపర్య రక్త సంబంధిత వ్యాధులైన థలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, వాటి నివారణ, ముందస్తు గుర్తింపు, నిర్వహణపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించేందుకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని ఐడీఓసీలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా వైద్యారోగ్య శాఖ, థలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు, ఎంపీహెచ్ సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా  చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్, సెక్రటరీ డా. సుమన్ జైన్, వైస్ ప్రెసిడెంట్ రత్నావళి, సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ డా. పద్మ అవగాహన ప్రసంగాలు అందించారు. థలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు, ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్, రోగనిర్ధారణ, తగిన వైద్య సంరక్షణ తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా. శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారి డా. శంకర్ పాల్గొన్నారు. జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉన్న సముదాయాల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు, ముందస్తు స్క్రీనింగ్, సకాలంలో వైద్య జోక్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. ముందస్తుగా వ్యాధిని గుర్తించడం ద్వారా బాధితులకు తగిన వైద్య సేవలు, సంరక్షణ అందించేందుకు అవకాశం ఉంటుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది ఈ అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇదే సందర్భంగా హైదరాబాద్ హెచ్ఐసీసీ, నొవొటెల్‌లో అక్టోబర్ 23 నుంచి 25, 2026 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ  గస్సిడ్ కాంగ్రెస్ గురించి కూడా పాల్గొన్న వారికి వివరించారు.

# ప్రజాసేవే ఊపిరిగా జీవించిన పాల్లెర హనుమంతరావు

## - 47వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ నాయకులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసి, పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన 'డెక్కన్ గాంధీ' పాల్లెర హనుమంతరావు 47వ వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ బాయ్స్ జూనియర్ కాలేజీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పాల్లెర హనుమంతరావు ప్రజాసేవకు చేసిన కృషి, ఆయన త్యాగాలు, పోరాటాలను స్మరించుకున్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, డీసీసీ జనరల్ సెక్రటరీ సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు బెక్కరి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ జనరల్ సెక్రటరీలు రాము యాదవ్, సాయి బాబా, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, మీడియా సెల్ సీజే బెనహర్, కాంగ్రెస్ నాయకులు బాసిత్, అక్బర్, టి.సి. శ్రీనివాస్, నూర్ భాయ్, మొయిజ్, సేవాదళ్ వెంకట్ లక్ష్మి, అలీ భాయ్ తదితరులతో పాటు పాల్లెర హనుమంతరావు కుటుంబ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు. పాల్లెర హనుమంతరావు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## - వినాయక చవితికి మట్టి విగ్రహాలనే వినియోగించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా






**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, రసాయనాలతో కూడిన రంగుల వినియోగం వల్ల నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను వినియోగించడాన్ని ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. "మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పండుగల సందర్భంగా సంప్రదాయాలు, భక్తిభావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణానికి మేలు చేకూర్చేలా ప్రజలు చైతన్యం చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్ఓ ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాళోజీ ఆశయాలు ప్రజాసేవకు మార్గదర్శకం

## - ప్రజాకవి సేవలను స్మరించుకున్న జిల్లా ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



తెలంగాణ ప్రజాకవి, సాహితీవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దరావత్ జానకి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను సమాజం ముందుకు తీసుకువచ్చిన గొప్ప ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సామాజిక పరిస్థితులు, ప్రజల ఆకాంక్షలను తన సాహిత్యంలో ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అన్యాయం, అసమానతలు, సామాజిక రుగ్మతలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కాళోజీ ఆలోచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని ఎస్పీ అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథం వంటి ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత చేరువగా ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని పరిష్కరిస్తూ, సమర్థవంతమైన ప్రజానుకూల పోలీసింగ్ అందించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, అశోక్‌కుమార్, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులర్పించారు.



# పర్యాటక అభివృద్ధికి పాలమూరులో కొత్త ప్రణాళికలు

## - రామకొండను బెస్ట్ టూరిజం గ్రామంగా అభివృద్ధి

## జడ్చర్లలో హెరిటేజ్, టూరిజం ప్లాజాలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంతో పాటు కొత్త పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్ బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, పర్యాటక శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణం, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సీఎస్‌ఆర్ నిధుల సమీకరణ, జిల్లాల్లో మూడంచెల పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ ఖుష్బూ గుప్తా వివరించారు. కోయిల్‌కొండ మండలంలోని రామకొండను 'బెస్ట్ టూరిజం విలేజ్'గా అభివృద్ధి చేయడంతో పాటు ఫిల్మ్ షూటింగ్‌లకు అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జడ్చర్లలో హెరిటేజ్ ప్లాజా, టూరిజం ప్లాజాలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కలెక్టర్ వివరించారు. తద్వారా జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతో పాటు పర్యాటకుల కోసం మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పర్యాటక ప్రాంతాల సందర్శన, వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించి పర్యాటక ప్రదేశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలో జ్ఞాన్ భారత్ నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను, టూరిజం నోడల్ అధికారిగా క్రిస్టినాను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యం, సీఎస్‌ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పర్యాటక డైరెక్టర్ రంజిత్ నాయక్, కల్చర్, హెరిటేజ్ డైరెక్టర్లు పాల్గొనగా, జిల్లా నుంచి కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో పాటు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా టూరిజం అధికారి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహార లోప నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం కీలకం

## - 'మన అంగన్‌వాడీ.. మన బాధ్యత'తో పోషణ్ మాహ్ కార్యక్రమాలు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రజల భాగస్వామ్యంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. పోషణ్ మాహ్ కార్యక్రమాలను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరి సామూహిక బాధ్యతగా నిర్వహించాలని సూచించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్2026 పోస్టర్‌ను కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహించే పోషణ్ మాహ్ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు."హమారీ అంగన్‌వాడీ.. హమారీ జిమ్మేదారీ" (మన అంగన్‌వాడీ.. మన బాధ్యత) అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ ఏడాది కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజల్లో సామాజిక బాధ్యత, సామూహిక యాజమాన్య భావన పెంపొందించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, మానసిక వికాసానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ, సంరక్షణ, బాల్య వికాసానికి కీలక వేదికలుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఆహారంలో వైవిధ్యం, తగినంత ప్రోటీన్ తీసుకోవడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజా వేడిగా వండిన భోజనం అందించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సామాజిక యాజమాన్యంజవాబుదారీతనం, బాల్య వికాసానికి పోషణప్రారంభ ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా తల్లుల ఆరోగ్యానికి అందించే నగదు ప్రయోజనాలపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో విస్తృత కార్యక్రమాలు చేపట్టి, ప్రజలను చురుకుగా భాగస్వాములను చేయడం ద్వారా జిల్లాలో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్‌ఓ ఎ.నిర్మల, ఆర్‌డీఓ నవీన్, జెడ్‌పీ సీఈఓ డి.పి.ఓ. వెంకటరెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్, డీపీఆర్‌ఓ పి.శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రాజీ మార్గమే రాజమార్గం.. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

## - పరస్పర అంగీకారంతో వివాదాలకు సత్వర పరిష్కారం : జిల్లా ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఈ నెల 12వ తేదీ శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకుని సమయం, ధనం ఆదా చేసుకోవాలని ఆమె కోరారు. కోర్టుల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న రాజీ పడదగిన వివాదాలను ఇరుపక్షాల పరస్పర అవగాహనతో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమని ఎస్పీ తెలిపారు. దీనివల్ల న్యాయపరమైన ప్రక్రియలో సమయం, ఖర్చు తగ్గడంతో పాటు మానసిక ఒత్తిడి కూడా తగ్గి, ఇరువర్గాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి తగాదాలు, కుటుంబవైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన కేసులు, సైబర్ సంబంధిత రాజీ పడదగిన కేసులు తదితర కేసులను చట్టపరమైన నిబంధనల మేరకు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ వివరించారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా మార్చుకుని కక్షలు పెంచుకోవడం వల్ల ఇరువర్గాలు సమయం, డబ్బు కోల్పోవడంతో పాటు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆమె అన్నారు. పరస్పర చర్చలు, అవగాహన, రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగించవచ్చని సూచించారు."రాజీ మార్గమే రాజమార్గం" అనే విషయాన్ని ప్రజలు గుర్తించి, న్యాయశాఖ అందిస్తున్న జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డి.జానకి విజ్ఞప్తి చేశారు. తమకు సంబంధించిన రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు.జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత ఇరువర్గాలను సంప్రదించి అవసరమైన అవగాహన, కౌన్సిలింగ్ కల్పిస్తూ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేస్తారని ఎస్పీ తెలిపారు. తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీసు అధికారులు లేదా కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బందిని సంప్రదించాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంతో బాధితులకు ఉపశమనం లభించడంతో పాటు ఇరువర్గాల మధ్య సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఎస్పీ జానకి పేర్కొన్నారు.



# ప్రత్యేక అవసరాల పిల్లలు రంగాల్లో నైపుణ్యం సాధించాలి

- తల్లిదండ్రులు నిరాశకు గురికావద్దు
- విద్యాశాఖ, ప్రత్యేక ఉపాధ్యాయుల సహకారం పొందాలి
- డిఇఓ రమేష్ కుమార్

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్‌కర్నూల్ జిల్లాలో 2,514 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ప్రత్యేక విద్య ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలను తల్లిదండ్రులు భారంగా భావించకుండా, వారికి ప్రభుత్వం నుండి అందుబాటులో ఉన్న విద్యా, శిక్షణ, సంక్షేమ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో...సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని డీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంరక్షణ, విద్యా , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సదుపాయాలు, వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ రమేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల విద్యాభివృద్ధికి విద్యాశాఖ అనేక రకాలసదుపాయాలు, సేవలు, అలవెన్సులు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలనుతల్లిదండ్రులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు .నాగర్‌కర్నూల్ జిల్లాలో వివిధ రకాల వైకల్యాలు కలిగిన 2,514 మంది విద్యార్థులకు విద్యను అందించేందుకు 20 మంది ఐఆర్పీలు, 55 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు సేవలు అందిస్తున్నారని డీఈఓ రమేష్ కుమార్ వివరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా విద్య, శిక్షణ అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు నిరాశ, నిస్పృహలకు గురికాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఆర్పీల సహకారంతో పిల్లలకు అవసరమైన ప్రత్యేక శిక్షణ అందిస్తూ వారి సామర్థ్యాలను మరింతగా అభివృద్ధి చేయాలని కోరారు. సరైన ప్రోత్సాహం, నిరంతర శిక్షణ, తల్లిదండ్రుల సహకారం ఉంటే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు కూడా జీవితంలో ఉన్నత స్థానాలనుఅధిరోహించగలరని అన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల కోసం అమలు




చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సదుపాయాలు, అలవెన్సులు తదితర ప్రయోజనాలను అర్హులైన ప్రతి విద్యార్థి పొందేలా తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని డీఈఓ సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు అందిస్తున్న వివిధ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్యతో పాటు వారి సామాజిక, మానసిక, వ్యక్తిగత అభివృద్ధిపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. పిల్లలలో ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి తగిన అవకాశాలు కల్పిస్తే వారు విద్య, క్రీడలు, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలతో పాటు ఇతర అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, ఏఎంఓ కిరణ్ కుమార్, ఏఎస్ఓ మాధవరెడ్డి, డీఎస్ఓ శైలజ, జీసీడీఓ నిర్మలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఐఆర్పీలు, ప్రత్యేక ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా కాళోజి

## గండీడ్‌లో ఘనంగా కాళోజి నారాయణరావు 112వ జయంతి వేడుకలు

**గండీడ్, సెప్టెంబర్ 9 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో బుధవారం ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజి నారాయణరావు 112వ జయంతి వేడుకలను హాస్టల్ వార్డెన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హాస్టల్ వార్డెన్ కృష్ణయ్య మాట్లాడుతూ.. కాళోజి నారాయణరావు ప్రజాకవిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, సాహితీవేత్తగా తెలంగాణ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, తెలుగు భాషా సాహిత్యానికి ఆయన అందించిన సేవలు శిరస్మరణీయమన్నారు. "నాది బడి పలుకుల భాష కాదు.. పలుకుబడుల భాష నా మాతృభాష తెలుగు" అని ఎలుగెత్తి చాటిన మహానుభావుడు కాళోజి అని పేర్కొన్నారు. తెలంగాణ యాస, పలుకుబడితో సామాన్య ప్రజల మాటలు, వారి బాధలను తన రచనల ద్వారా వ్యక్తం చేసిన తీరు ఎంతో గొప్పదన్నారు. "అన్యాయాన్ని ఎదిరించిన వాడు నాకు ఆరాధ్యుడు" అనే కాళోజి సందేశం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పరభాషా జ్ఞానాన్ని నేర్చుకోవడం మంచిదేనని, అయితే అమ్మలాంటి మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదని కాళోజి చెప్పిన మాటలను గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కాళోజి నారాయణరావు చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గండీడ్ రిపోర్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ కోఆర్డినేటర్ మైపాల్ రెడ్డి రఘు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# స్పీకర్‌ను అవమానిస్తే సహించం

- తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలను బర్తరఫ్ చేయాలి

- అనుచిత వ్యాఖ్యలపై రాజ్యాంగబద్ధంగా చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ ఎస్సీ విభాగం

**వనపర్తి, సెప్టెంబరు 9 (ప్రజాజ్యోతి):**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలను వెంటనే పదవుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. వారిపై రాజ్యాంగబద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో సంఘీభావ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్ మాట్లాడుతూ.. శాసనసభ నియమావళికి విరుద్ధంగా వ్యవహరించడంతోపాటు మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన తీరు ప్రజలు గమనించారని అన్నారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకగా ఉన్న శాసనసభలోనే నిబంధనలను ఉల్లంఘించడం సరికాదన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుల వ్యవహారశైలిని ప్రజల ముందు ఎండగడతామని రాజ్‌కుమార్ అన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన వారిపై ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ పద్ధతుల్లోనే తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శులు ఐ.సత్యరెడ్డి, బ్రహ్మచారి, బి.కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అత్తం రవికుమార్, మండల అధ్యక్షులు వెంకటస్వామి, నరహరి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జానకిరాములు, శ్రీను, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరి, సురేష్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు విశ్వంబాబు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# సాలార్ నగర్ ప్రాజెక్టు నుంచి వెన్నచేడ్ చెరువుకు నీరు!

## నీటి తరలింపునకు కాల్వ పనులు..

## పనులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

**వెన్నచేడ్, సెప్టెంబర్ 9 (ప్రజాజ్యోతి):**

సాలార్ నగర్ ప్రాజెక్టు నుంచి వెన్నచేడ్ గ్రామంలోని పెద్ద చెరువుకు నీటిని తరలించేందుకు కాల్వ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను బుధవారం ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించారు. సాలార్ నగర్ ప్రాజెక్టు నుంచి నీరు వెన్నచేడ్ పెద్ద చెరువుకు చేరేలా చేపడుతున్న కాల్వ నిర్మాణ పనులను నీటిపారుదల శాఖ డీఈ శ్రీకాంత్, ఏఈ కార్తీక్ రెడ్డి, వెన్నచేడ్ గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, దిలీప్ కుమార్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సాలార్ నగర్ ప్రాజెక్టు నుంచి వెన్నచేడ్ పెద్ద చెరువుకు నీటిని తీసుకెళ్లేందుకు అవసరమైన కాల్వ పనులను చేపడుతున్నామని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్టు నీటిని చెరువుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సాలార్ నగర్ ప్రాజెక్టు నీరు వెన్నచేడ్ పెద్ద చెరువుకు చేరితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉందని సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య తెలిపారు. చెరువుకు నీరు తీసుకురావడానికి కృషి చేస్తున్న ఇరిగేషన్ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, స్థానికులు పులిందర్ రెడ్డి, నీరటి కేశవులు, మాధవులు తదితరులు పాల్గొన్నారు.



# సామూహిక ఇష్టలింగ పూజ మహోత్సవం

## - భక్తిశ్రద్ధలతో సామూహిక ఇష్టలింగ పూజ మహోత్సవం

## - శ్రావణ మాస ముగింపు సందర్భంగా ఘనంగా నిర్వహణ

**వెన్నచేడ్, సెప్టెంబర్ 9 (ప్రజాజ్యోతి):**

శ్రావణ మాస ముగింపు సందర్భంగా వెన్నచేడ్ శివాలయంలో బుధవారం శ్రీ 108 శ్రబ్ర శ్రీ శ్రీ శ్రీ సిద్ధిలింగేశ్వర శివాచార్య స్వాములవారి ఆధ్వర్యంలో సామూహిక ఇష్టలింగ పూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జాకన్పల్లి మఠానికి చెందిన స్వాములవారు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు ఆశీర్వచన సందేశాన్ని అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివశ్రీ సదాశివ స్వామి, మఠం వీరభద్రయ్య స్వామి, జంగం వినయ్ కుమార్ స్వామి, జంగం ఆదిత్య ప్రభు స్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా ఇష్టలింగ పూజలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా స్వామివారు మాట్లాడుతూ వీరశైవ ధర్మంలో ఇష్టలింగ పూజకు ఎంతో విశిష్టమైన స్థానం ఉందని, ప్రతి భక్తుడు నిత్యం ఇష్టలింగాన్ని ఆరాధిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. వీరశైవ మతం గొప్పతనం, లింగధారణ ప్రాముఖ్యత, భక్తిధర్మాచరణ గురించి భక్తులకు వివరించారు. లింగధారణ కేవలం ఆచారం మాత్రమే కాదని, భక్తుడి ఆధ్యాత్మిక జీవనానికి మార్గదర్శకమని తెలిపారు. అనంతరం పలువురు భక్తులకు లింగధారణ కార్యక్రమం నిర్వహించారు. మహిళామణులు సైతం అధిక సంఖ్యలో పాల్గొని ఇష్టలింగ పూజలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో వీరశైవ సంఘ మండల అధ్యక్షులు రాజేశ్వర్, శివమల్లప్ప, భద్రయ్య, రామలింగం, రాజు, వజ్రపతి, మల్లికార్జున్, భద్రేశ్వర్, సంగమేష్, శేఖర్, శరణయ్య, రఘుతో పాటు వీరశైవ సంఘ సభ్యులు, మహిళామణులు, మహ్మదాబాద్ మండల అధ్యక్షులు. పవన్ కుమార్ మరికొందరుభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఫీజు కట్టలేదంటే పరీక్షకు నో ఎంట్రీనా.!?

**- విద్యార్థులపై క్రమశిక్షణ పేరుతో వేధింపులు.. విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలినా చర్యలు ఎక్కడ..?**

**- సి డబ్ల్యూ సీ లేఖకు 20 రోజులు దాటినా స్పందించని విద్యాశాఖ అధికారి చివరకు పోలీసులను ఆశ్రయించిన కమిటీ.!**

**- పిర్యాదు ను కలెక్టర్ ఖుష్బూ గుప్తా విద్యాశాఖకు ఫార్వర్డ్ చేసిన చర్యలు నిల్..!!**

మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి బ్యూరో ): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలల్లోనే వారి హక్కులు హరిస్తూ, ఆత్మగౌరవం ప్రశ్నార్థకంగా మారితే బాధ్యత ఎవరిది.? ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం, క్రమశిక్షణ పేరుతో మోకాళ్లపై కూర్చోబెట్టడం వంటి ఆరోపణలు ఎదుర్కొన్న మహబూబ్‌నగర్‌లోని ప్రశాంతి నికేతన్ హైస్కూల్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై గతంలో వచ్చిన ఫిర్యాదులు, పత్రికల్లో ప్రచురితమైన కథనాల అనంతరం విద్యాశాఖ అధికారులు కూడా స్పందించారు. పాఠశాలకు సంబంధించి ఎంఈఓ ఆంగోత్ లక్ష్మణ్ సింగ్ షోకాజ్ నోటీసు జారీ చేయగా, దానికి సంబంధించిన వివరణ పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, విద్యార్థులపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవహారంపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి డబ్ల్యూ సీ) దృష్టి సారించింది. కమిటీ ప్రతినిధులు పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టినట్లు, విచారణలో ఫిర్యాదుల్లోని ఆరోపణలు వాస్తవమని నిర్ధారించినట్లు కమిటీ పేర్కొంది.

**విచారణ జరిగింది.. వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.. మరి చర్యలు.?**

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. పిల్లలతో సంబంధం ఉన్న ఫిర్యాదు.. పరీక్ష రానీయకుండా తోటి విద్యార్థుల ముందు అవమానపరిచిన పాఠశాలపై షోకాజ్ నోటీసు. కమిటీ స్థాయి విచారణ అనంతరం ఆరోపణలు వాస్తవమని కమిటీ నిర్ధారణ చేసి సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచన చేశారు. సి డబ్ల్యూ సీ నుంచి వచ్చిన లెటర్ ను సైతం సంబంధిత అధికారులు చదవకపోవడం వారి నిబద్ధతగల పనితనానికి, నిర్లక్ష్యపు " ఐ లవ్ మై జాబ్" పనితనానికి నిదర్శనం అని చెప్పవచ్చు. ఎందుకంటే సదరు "ఎడి నీ పిర్యాదు దారుడు సంప్రదించగా మాకు ఆ లెటర్ సంగతే తెలవదు" అని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. 20 రోజులు గడిచినా విద్యాశాఖ నుంచి స్పష్టమైన చర్య కనిపించకపోవడం విద్యా శాఖ అధికారుల తీరుపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. పిల్లల విషయంలో మాత్రం అధికారులు ఫైళ్లను ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కు పంపించుకుంటూ కాలం గడిపితే ఎలా.? విద్యార్థుల సమస్యలకు కూడా "ఫైల్ కదలిక" వేగమే ప్రమాణమైతే, వారి భవిష్యత్తు పరిస్థితి ఏమిటన్నది తల్లిదండ్రుల ఆందోళన. అంతే కాకుండా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కు ఖాజా మొయినుద్దీన్ తన పిల్లల పట్ల ప్రశాంతి నికేతన్ పాఠశాల యాజమాన్యం వైఖరి పట్ల ఫిర్యాదు చేశాడు, చేసి నెల రోజులు గడుస్తున్నా నేటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు అంటే "కలెక్టర్ అడ్మినిస్ట్రేషన్ సరిగా లేదా.? విద్యాశాఖ అధికారుల పనితీరు బాగాలేదా!" అన్న సందేహం వెలువడుతోంది.

**చివరకు పోలీసులను ఆశ్రయించిన సి డబ్ల్యూ సీ:**

విద్యాశాఖ పరిధిలో చర్యలు తీసుకోవాలని గత నెల 19 న చర్యలు తీసుకోవాలని కోరుతూ లెటర్ ఇవ్వడం జరిగింది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. పిల్లలతో సంబంధం ఉన్న ఫిర్యాదు. పాఠశాలపై షోకాజ్ నోటీసు. కమిటీ స్థాయి విచారణ. ఆరోపణలు వాస్తవమని కమిటీ నిర్ధారణ. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచన. కమిటీ సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారికి లేఖ పంపినప్పటికీ స్పందన లేకపోవడంతో, తాజాగా ప్రశాంతి నికేతన్ హైస్కూల్ యాజమాన్యం, సంబంధిత ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు సి డబ్ల్యూ సీ చైర్మన్ లేఖ అందజేసినట్లు తెలుస్తోంది. అంతేకాదు, పాఠశాలపై కేసు నమోదు చేసి చర్యలు




తీసుకోవాలని కూడా కమిటీ సిఫారసు చేసినట్లు సమాచారం.

**"పిల్లల మానసిక వేదనకు ధర ఎంత.?"**

ఫీజు చెల్లించలేకపోవడం ఒక కుటుంబ ఆర్థిక పరిస్థితి కావచ్చు. కానీ దాని భారాన్ని విద్యార్థులపై మోపడం ఎంతవరకు సమంజసం.? విద్యాహక్కు చట్టం ఏం చెబుతోంది. పరీక్ష రాయనివ్వకపోవడం, తోటి విద్యార్థుల ముందు అవమానించడం లేదా క్రమశిక్షణ పేరుతో శారీరక శిక్షలకు గురిచేయడం వంటి చర్యలు నిజమైతే, అవి కేవలం పాఠశాల నిబంధనల ఉల్లంఘనగా చూసే అంశాలేనా? లేక పిల్లల హక్కులు, వారి గౌరవం, మానసిక భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశాలుగా చూడాల్సిన అవసరం ఉందా.? విచారణలో ఆరోపణలు నిజమని తేలినట్లు కమిటీ చెబుతున్న పరిస్థితిలో, తదుపరి చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాలలపై తనిఖీలు, షోకాజ్ నోటీసులు, విచారణలు అన్నీ జరిగాక కూడా చర్యలు లేకపోతేడ"విద్యార్థుల ఫిర్యాదులకు పరిష్కారం ఎప్పుడు. దొరుకుతుంది ..?" అన్న ప్రశ్న మిగిలిపోతుంది. పిల్లల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో విద్యాశాఖ, సి డబ్ల్యూ సీ, పోలీస్ శాఖలు సమన్వయంతో నిష్పక్షపాతంగా వ్యవహరించి, బాధ్యులు ఎవరైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పిల్లలపై జరిగిన అవమానం కంటేడ దానిపై అధికారుల మౌనం మరింత బాధాకరంగా కనిపిస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు మీన వేషాలు వేయకుండా రెండు కళ్లు తెరిచి, "పిల్లల హక్కులు ముందు.. ఫైళ్లు తర్వాత" అనే సందేశాన్ని కార్యాచరణ ద్వారా చూపిస్తారా.? అన్నదే వేచి చూడాల్సి ఉంది.

## గణేష్ నవరాత్రుల.. శాంతి సమావేశం

### గణేష్ నవరాత్రుల వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలి - డీఎస్పీ పల్లె శ్రీనివాస్



**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అచ్చంపేటలో డీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం పీస్ మీటింగ్‌నిర్వహించారు. ఈ శాంతి సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మరియు స్థానిక ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను గౌరవిస్తూ, సోదరభావం మరియు సామరస్యంతో పండుగనునిర్వహించాలని కోరారు. అలాగే, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ శాంతి, సామరస్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు సూచించారు. అదేవిధంగా గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించడమే మనందరి బాధ్యత అని అధికారులు వ్యాఖ్యానించారు . ఈ సమావేశంలో స్థానిక ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు తమ అభిప్రాయాలను డీఎస్పీ పల్లె శ్రీనివాస్, సీఐ, అచ్చంపేట ఎస్సై పోలీసు అధికారులతో పంచుకున్నారు.